ఆధ్యాత్మిక సేవలో అతివలు

- దేవాలయాల్లో సేవలకు చేయూత
- బృందాలుగా ఏర్పడి సహకారం
- దక్షిణంలో 10 వరకు గ్రూపులు
- గ్రూపులో 10 నుంచి 30 మంది సభ్యులు

అల్లిపురం: మానసిక ఒత్తిడిని దూరం చేసి, ప్రశాంతత నిచ్చేది ఆధ్యాత్మిక చింతన. ఆ దిశగా అడుగులు వేస్తూ తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, దేవుని సేవలో తరిస్తున్నారు కొందరు మహిళలు. బృందాలుగా ఏర్పడి, దేవాలయాల్లో జరిగే సేవల్లో పాలుపంచుకుంటున్నారు. అలా జిల్లా వ్యాప్తంగా సుమారు 30వరకు గ్రూపులుండగా, దక్షిణ నియోజకవర్గంలో సుమారు 10 వరకు బృందాలున్నాయి. ఈ బృందాల్లో 10 నుంచి 30 మంది వరకు సభ్యులు ఉంటున్నారు. నిర్వాహకులు గ్రూపులను వివిధ దేవాలయాల్లో సేవలకు పంపిస్తుంటారు. ఈ సంఘాల్లో ఎస్వీ సేవా సంఘం ఒకటి. దీని అధ్యక్షుడిగా ఎ.సుదర్శనరావు, ఉపాధ్యక్షుడిగా పీవీఎల్ఎన్ గుప్తా, కోశాధికారిగా దాడి నగేష్ వ్యవహరిస్తున్నారు. వీరు జగన్నాథస్వామి దేవస్థానంలో రెండు రోజులుగా సేవలు అందిస్తున్నారు.



గ్రూపు సభ్యులు

పెద్ద దేవాలయాల్లో సేవలు : నగరంలో ఆధ్యాత్మిక సేవ చేసే గ్రూపులు అధికంగానే ఉన్నాయి. నగరంలోని శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, జగన్నాథ స్వామి దేవస్థానం, సంపత్ వినాయగర్, పోలమాంబ దేవస్థానం, భీమిలి నూకాలమ్మ, అనకాపల్లి నూకాలమ్మ, సింహాచలం దేవస్థానాలతో పాటు ఇతర జిల్లాల్లో సేవలకు వీరికి పిలుపు వస్తుంటుంది. వీరు దేవాలయంలో శుభ్రత, అన్నదాన సేవ, హుండీ లెక్కింపు, భక్తులకు మంచినీళ్లు, ప్రసాదాల పంపిణీ వంటి సేవల్లో తరిస్తున్నారు. అవకాశాన్ని బట్టి తమ సేవలను కొనసాగిస్తూ ఆత్మ సంతృప్తిని పొందుతున్నారు. ఇది తమకు ఎంతో ప్రశాంతతను ఇస్తోందని, ఈ సేవలు ఇలా కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు.



జగన్నాథస్వామి దేవస్థానంలో అన్నసమారాధనలో పాల్గొన్న సేవా కార్యకర్తలు



ఆలయంలో హుండీ లెక్కింపులో పాల్గొన్న సేవకులు

15 ఏళ్లుగా సేవలోనే..



ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మనసుకు సంతృప్తినిస్తుంది. దేవాలయంలో ఏ సేవ అయినా చేస్తాం. సీనియర్ సభ్యులు సుదర్శనరావు, గుప్తా, డి.జగదీష్ నాయకత్వంలో 15 సంవత్సరాలుగా సేవ చేస్తున్నాం. ఆధ్యాత్మిక సేవలో ఎంతో ఆనందం ఉంది.

– మళ్ల హేమ, ఎస్వీ గ్రూప్ కో–ఆర్డినేటర్

ఎంతో ప్రశాంతత



నేను 4 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఆధ్యాత్మిక చింతనతో రోజంతా గడపటంతో ప్రశాంతత కలుగుతుంది. భగవంతుని సేవలో పాలుపంచుకోవడం ఆనందాన్నిస్తోంది. జీవితానికి పరమార్థం కలుగుతుంది.

– ఎం.అరుణ, గ్రూపు సభ్యురాలు

సేవలో సంతృప్తి



నేను ఏడాదిగా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. బృందాలుగా పాల్గొనడం ద్వారా సామాజిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఎక్కడెక్కడి వారమో.. అందరం ఒక దగ్గర చేరాం. ఆందోళనలకు దూరంగా ప్రశాంతంగా ఉంటున్నాం. భగవత్ చింతన, సేవలో సంతృప్తి పొందుతున్నాం.

– ఎం.సుబ్బలక్ష్మి, గ్రూపు సభ్యురాలు

డిప్రెషన్‌ను దూరం చేస్తుంది



నాలుగేళ్లుగా సేవలో పాల్గొంటున్నా. ఇందులోకి వచ్చాక డిప్రెషన్ దూరం అయింది. బాధలున్నా సేవ చేసినంతసేపు అదే ధ్యాసలో ఉండటంతో మరిచిపోతుంటాం. సభ్యులతో, భక్తులతో మాట్లాడుతూ వారికి తగిన సూచనలు ఇస్తూ దేవునికి అత్యంత సన్నిహితంగా ఉంటూ ఉత్సాహంగా ఉంటున్నాం.

– బి.సునీత, గ్రూపు సభ్యురాలు

దేవుని సేవలో తరిస్తున్నాం



రెండేళ్లుగా దేవుని సేవలో పాల్గొంటున్నాం. రోజులో కొద్దిసేపు సేవ చేసుకోవడం చాలా తృప్తినిస్తుంది. ఈ అవకాశం అందరికీ రాదు. మాకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం.

– వి.నాగమణి, సేవకురాలు

క్లుప్తంగా

5న జాతీయ లోక్ అదాలత్

విశాఖలీగల్: ఈనెల 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు. సోమవారం జిల్లా కోర్టు న్యాయసేవాసదన్‌లో పలు సంస్థలు, పోలీసులు, బీమా కంపెనీలతో సమావేశం నిర్వహించారు.

కుటుంబం చెంతకు యువతి



అమూల్యను ఆమె సోదరి స్వరూపకు అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి

అల్లిపురం: ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన పాడేరుకు గోడితల అమూల్య(20)ను తిరిగి ఆమె కుటుంబానికి అప్పగించారు. వివరాలివి.. ఫోర్త్ టౌన్ పోలీసులు గత నెల 28న రాత్రి గస్తీ తిరుగుతున్న సమయంలో యువతిని గుర్తించి, ఏయూటీడీ జీవీఎంసీ టీఎస్సార్ మహిళా వసతి గృహానికి అప్పగించారు. పోలీసు విచారణలో ఆమె తాను అనాథనని తెలిపినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అయితే, ఆమె ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చిందని తెలుసుకున్నారు. సోమవారం ఆమె అక్క కొండ స్వరూపను షెల్టర్‌కి పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఏయూటీడీ కేర్ టేకర్ నారాయణరావు సమక్షంలో క్షేమంగా అప్పగించారు.

శ్వేత వారాహిమాతగా అమ్మవారు



శ్వేత వారాహి మాతగా వారాహి అమ్మవారు

అల్లిపురం: వివేకానందకాలనీలో శ్రీ సాయి మేరు ట్రస్ట్ ఆస్థానంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సోమవారం అమ్మవారు శ్వేత వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించి, పూజలు చేశారు.

కాంపౌండ్ వాల్ పైనుంచి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి పులిగెడ్డ టవర్స్, సెల్లార్ కాంపౌండ్ వాల్ పై నుంచి సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వ్యక్తి పడిపోయాడు. ఈ ఘటనలో అతని తల నేలకు తగిలి, బలమైన దెబ్బలు తగలడంతో మరణించాడు. అతని పేరు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని మహారాణిపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని ఛాతీ భాగంలో ఒక పుట్టుమచ్చ, మృతుని ఎడమ చేతిపై సంధ్యారాణి అనే పేరు గల టాటూ, కుడి చేతిపై రెడ్డి అనే పేరు గల టాటూ మార్కులు ఉన్నాయని తెలియజేశారు. తెలుగు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440796010, 9440796052 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యం పెంచుకోవాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- కర్మయోగి పోర్టల్‌పై శిక్షణ



ఆన్‌లైన్ ద్వారా అధికారులు, ఉద్యోగులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: కర్మ యోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. విజయవాడ ఏపీఎస్‌డీపీఎస్ నుంచి జిల్లా అధికారులకు కర్మయోగి పోర్టల్‌పై ఆన్‌లైన్ ద్వారా ఇచ్చిన శిక్షణ అనంతరం ఆయన మాట్లాడారు. టెక్నాలజీకి అనుగుణంగా పని చేసేందుకు కర్మయోగి పోర్టల్‌ను ఏర్పాటు చేశారని, దీనిలో 10 కోర్సులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో ఉంచారని తెలిపారు. ఉద్యోగులంతా యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని, వారంలోగా మూడు కోర్సులు నేర్చుకోవాలని.. ఆన్‌లైన్ సర్టిఫికెట్ పొంది జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. క్రమంగా మిగిలిన కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉద్యోగులు కోర్సులు పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే మినీ సెంటర్ల అప్‌గ్రేడేషన్

మిగిలిన సెంటర్లలో వారికీ అర్హతలో మినహాయింపునకు వినతి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

దాబాగార్డెన్స్: అంగన్‌వాడీ మినీ వర్కర్లకు అర్హతలో మినహాయింపు ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని మినీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసిన సందర్భంగా జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మినీ వర్కర్ల విజయోత్సవ సభలో ఆమె మాట్లాడారు. గతేడాది 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె చేపట్టామన్నారు. అనేక పోరాటాల ఫలితంగా ఇటీవల రాష్ట్ర కేబినేట్ 4687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. సిటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ మిగిలిన 1810 మినీ సెంటర్లలో మినీ వర్కర్లకు పదో తరగతి క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయకపోవడం సరికాదన్నారు. మినీ వర్కర్ల రాష్ట్ర కన్వీనర్ ఎస్.నాగశేషు, రాష్ట్ర కార్యదర్శి ఎల్.దేవి, రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ, సీహెచ్.రామలక్ష్మి, ఎస్.లలిత, జి.వెంకటలక్ష్మి, ఎస్.వాసుదేవి, నరసయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరుపుల గొడౌన్‌లో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న టూటౌన్ సీఐ యర్రంనాయుడు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, మనోరమ థియేటర్ ఎదురుగా గల వీధిలో ముకాస్ మార్కెటింగ్ ఏజెన్సీ పరుపులు కంపెనీ షాపులో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. అచ్చియ్యమ్మపేటకు చెందిన గుడివాడ రాము మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలిస్తుండగా ఆ వీధిలో కొంత మంది తారాజువ్వలు వెలిగించారు. ఆ తారాజువ్వలు పైకి ఎగిరి ఇంటి పక్కనే ఉన్న పరుపుల కంపెనీ వెనుక గల ఖాళీ ప్రదేశంలో పడ్డాయి. బయట పరుపులు ఉండడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నారాయణ విషయం తెలుసుకుని ఫైర్ స్టేషన్‌కు తెలియజేయడంతో ఫైర్ సిబ్బందితో పాటు టూటౌన్ సీఐ యర్రంనాయుడు తమ సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఏడీఎఫ్ఓ వరప్రసాద్ తెలిపారు. షాపు యజమాని మహమ్మద్ ముస్తఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారాహి అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించిన సారె

దాబాగార్డెన్స్: వారాహి అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. పాతనగరం చిలకపేట పాత లక్ష్మీటాకీస్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వారాహిదేవి నవరాత్రుల్లో భాగంగా సోమవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, విశేష పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి 50 రకాల తీపి పదార్థాలు, వివిధ రకాల పండ్లతో సారె సమర్పించారు. అమ్మవారిని పసుపుతో అభిషేకించారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకుడు ఆర్‌బీబీ కుమారశర్మ, రాము, మల్లేశ్వరశర్మ, షణ్ముఖ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ పరిధిలో డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాలు ప్రారంభిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జీడీ బాబు మాట్లాడుతూ డ్రోన్ నిఘా వల్ల నేరాలు నిరోధించబడతాయన్నారు. డ్రోన్ నిఘా నుంచి ఎవరూ తప్పించుకోలేరని తెలిపారు. ప్రతి ఒక్కరూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

'ప్రసాద్ గార్డెన్స్'లో పట్టాల కోసం ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రసాద్‌గార్డెన్స్ వాసులు

మహారాణిపేట: పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రసాద్ గార్డెన్స్ వాసులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు దుర్గమాంబ యువజన సంఘం ప్రతినిధులు, సీపీఎం నాయకులు తదితరులు కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. శ్రీదుర్గమాంబ యువజన సంఘం నాయకుడు సిమ్మ అప్పారావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రసాద్ గార్డెన్స్‌లోనే నివాసం ఉంటూ, పట్టాల కోసం ఎదురు చూస్తున్నా ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సిమ్మ అప్పారావు, సీపీఎం నాయకులు ఎం.సుబ్బారావు, 35వ వార్డ్ నాయకుడు బాజిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉక్కు కార్మికులు

మహారాణిపేట: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, విశాఖ ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు పితాని భాస్కర్ మాట్లాడుతూ ఉక్కు నిర్వాసితులకు మిగిలిన భూమి ఇవ్వాలని, కార్మికులకు వన్ టైం సెటిల్మెంట్ చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ నష్టానికి ప్లాంట్ అధికారులే కారణమన్నారు. స్టీల్‌ప్లాంట్ నష్టానికి కారణమైన అధికారులపై వెంటనే సీబీఐ దర్యాప్తు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి ఉమ్మడి అప్పారావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టుల సంఘాల నాయకులు

మహారాణిపేట: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సోమవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. లోకల్ న్యూస్‌పేపర్ అసోసియేషన్, ఏపీయూడబ్ల్యూజే, ఏపీఎంఎఫ్ తదితర సంఘాల నాయకులు జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగానే 2025–26 విద్యా సంవత్సరానికి ఫీజు రాయితీ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రైవేటు స్కూళ్లలో ఫీజు రాయితీ కల్పిస్తామని, జర్నలిస్టులకు గతంలో మాదిరిగానే వైద్య పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ లేని జర్నలిస్టులకు కూడా వైద్య పరీక్షల విషయంలో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు



టాపర్‌ను సన్మానిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు కూర్మనాథ్

మహారాణిపేట: గత విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన గాండ్ల తెలికుల విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని విజేత ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ఎండీ, అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కశ్లేపల్లి కూర్మనాథ్ వీటిని అందించారు. పదో తరగతి విద్యార్థులు నరవ వివేక్ సాయి, గండేపల్లి పుష్పకానంద్, వాండ్రాసి హేమంత్, ఇంటర్లో దూది రేష్మ, జామి సాయి చైతన్య, మొల్లేటి నిఖితలకు నగదు, మెడల్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి బోయిదాపు రామారావు, జిల్లా సంఘ పెద్దలు యల్లేటి నరసింగరావు, సీటీవో ధర్మవరపు కృష్ణ, జిల్లా సంఘం న్యాయ సలహాదారులు గండేపల్లి త్రినాథ్ మూర్తి, ఎన్ఏఎస్ రాజు, సిటీ సంఘం అధ్యక్షులు రాజు, కెల్ల హరి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం ప్రసాద వితరణ

దాబాగార్డెన్స్: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి సోమవారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాన్ని ఎంకే అసోసియేట్స్‌కు చెందిన న్యాయవాది ఎంకే శ్రీనివాస్, ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాసరావు, కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ, కార్యక్రమ చైర్‌పర్సన్ చొప్పర్ల అయ్యప్ప, పలువురు సభ్యులు పాల్గొన్నారు.